క్లుప్తంగా

జయంతి వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలి



మంత్రిని కలిసిన యోహాన్

కొల్చారం(నర్సాపూర్): బహుజన మహనీయుల జయంతి, వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బహుజన జాగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యోహాన్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విషయమై మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి తెలియజేశామని పేర్కొన్నారు. ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రావు, 11న మహాత్మ జ్యోతిరావు పూలే, 14న అంబేద్కర్ జయంతి వేడుకలు ఉన్నాయని, వాటిని అన్ని జిల్లా, మండల, గ్రామాల్లో ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా చూడాలని కోరారు.

పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కస్తున్న మహేశ్వరశర్మ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని సదాశివపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ జరిగింది. సంగారెడ్డిజిల్లా ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి శుక్రవారం ప్రత్యేక పూజలుచేసి ఆవిష్కరించారు. ఆ విగ్రహాన్ని ఉపాధ్యాయుడు బాలకృష్ణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పురోహితుడు మెట్టు రాములుశర్మ, మాజీ సర్పంచ్‌లు శోభనర్సింగారావు, వీరయ్య, నాయకులు జనార్దన్, నాగరాజు, జోగయ్య, జి.వెంకటయ్య, సీహెచ్ వెంకటయ్య, శేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీలం మధును కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ ఎంపీ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. కలిసిన వారిలో వీరబోయిన గోపాల్, నర్సింహ్మాచారి, ఏర్కలి నర్సింహ, సత్యనారాయణ, నర్సింహ, కాళ్లకల్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మల్లేశ్, రాజు తదితరులు ఉన్నారు.

ఏడుపాయల మాజీ డైరక్టర్ మృతి



సంజీవరెడ్డి(ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల డైరక్టర్, కాంగ్రెస్ నాయకుడు సంజీవరెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు. పాపన్నపేట మండలం గాంధారిపల్లికి చెందిన రంగమ్మోళ్ల సంజీవరెడ్డి రెండు రోజుల క్రితం కిందపడి తలకు గాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మృతికి మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు శేషసైనారెడ్డి, నరేందర్ రెడ్డి, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

సన్నాహక సమావేశానికి తరలి వెళ్లిన నాయకులు



తరలి వెళుతున్న నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి తరలివెళ్లారు. శుక్రవారం జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్‌రామిరెడ్డిని గెలిపించుకోవడానికి దుబ్బాకలో జరిగే సన్నాహక సమావేశానికి వెళుతున్నట్లు తెలిపారు. వారిలో మండలశాఖ అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, నాయకులు రాజిరెడ్డి, పట్నం తానీషా, జర్నల్‌సింగ్, రమేశ్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

త్యాగానికి ప్రతిఫలమే గుడ్ ఫ్రైడే



కౌడిపల్లి(నర్సాపూర్): ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ చర్చిలో ..



చేగుంట(తూప్రాన్): వడియారం చర్చిలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): క్రీస్తు త్యాగానికి ప్రతిఫలమే ఈ శుభ శుక్రవారమని చిట్కుల్ సీఎస్ఐ చర్చి పాస్టర్ సామెల్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని చిట్కుల్ పాస్టరేట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. కార్యక్రమానికి 14 గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామెల్ మాట్లాడుతూ క్రీస్తు శిలువ వేసిన రోజే గుడ్ ఫ్రై డేగా పేరు వచ్చిందని, ఆయన ఆత్మ త్యాగం చేస్తూ జనులకు బోధించిన ఏడు వాక్యాలు తెలిపారన్నారు. ప్రార్థనల అనంతనం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, స్త్రీమైత్రి సభ్యులు, చిట్కుల్ క్రైస్తవ యువజన సంఘం తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం పాస్టర్ జైపాల్ ఆధ్వర్యంలో సీఎస్ఐ సంఘ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం పాస్టర్ దైవ సందేశం ఇచ్చారు.

పెద్దశంకరంపేట(మెదక్)లో..

పేటలోని సీఎస్ఐ చర్చితో పాటు పలు ప్రార్థనా మందిరాలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్‌లు దైవ సందేశం చదివి వినిపించి, ఏసుక్రీస్తు చూపిన సన్మార్గంలో నడవాలని సూచించారు.

చేగుంట(తూప్రాన్)లో..

మండల కేంద్రమైన చేగుంటతో పాటు పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే ఉత్సవాలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. వడియారం గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించగా ఆయా గ్రామాల భక్తులు, ట్రెజరర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను ఆరోపిస్తే తరిమికొడతాం

పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు



మాట్లాడుతున్న సుప్రభాతరావు తదితరులు

రామాయంపేట(మెదక్): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుపై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిని తరిమికొడతామని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మెదక్‌కు చెందిన నాయకుడు మామిళ్ల ఆంజనేయులు తన పరిధి దాటి విమర్శలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ నియోజకవర్గం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, ఇది చూసి ఓర్వలేకనే ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. జనేయులుకు మద్దతుగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడడం తగదన్నారు. ఇకనైనా ఆంజనేయులు తన వైఖరి మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి విప్లవ్, ఎంపీటీసీ నాగులు, జిల్లా నాయకులు హన్మంతరావు, శివప్రసాదరావు, పుట్టి అక్షయ్, కుమార్‌సాగర్, డాకి స్వామి, చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణం



అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించుకుంటున్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండంలోని అనంతసాగర్ గ్రామంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి కల్యాణం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వంద కోట్లు ఎలా వచ్చాయో చెప్పాలి

ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి వంద కోట్లు ఎలా వచ్చాయో చెప్పాకే ఓట్లు అడగాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ ప్రజల రక్తంతో సంపాదించిన డబ్బులతో రాజకీయం చేసేందుకు వచ్చిన వెంకట్రామిరెడ్డిని తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంటే ఫిరాయింపుదారులకు ఎందుకు టికెట్‌లు ఇస్తున్నారో రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బొమ్మాబొరుసు లాంటివని వాటిని నమ్మవద్దని చెప్పారు. మెదక్‌తో సహా దేశంలో 400 స్థానాలను బీజేపీ గెవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోగుల రాజు, మాజీ సర్పంచ్‌లు పెద్దులు, జిల్లా నాయకులు నందారెడ్డి, మల్లారెడ్డి, సక్కునాయక్, నరేందర్‌రెడ్డి, దశరథం, మంజుల పాల్గొన్నారు.

మురుగులోనే పయనం



జీడిపల్లి అండర్‌పాస్ బ్రిడ్జి వద్ద పారుతున్న మురుగునీరు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి చౌరస్తా వద్దగల జాతీయ రహదారి-44 అండర్ పాస్ బ్రిడ్జి కింద మురుగునీటితో నిండి చెరువులా మారింది. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ నీరు కూడా అక్కడికే చేరుతోంది. దీంతో వాహనదారులు మురుగునీటిలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జీఎమ్మార్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నీళ్లు మోయించిన టీచర్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులతో నీళ్లు మోయించిన టీచర్లపై చర్యలు చేపట్టనున్నట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. శుక్రవారం కామారం రాజ్యాతండా విద్యార్థులతో పాఠశాల అవసరాల కోసం వ్యవసాయ బోరు నుంచి నీళ్లు మోయించిన టీచర్ల తీరుపై సాక్షి పత్రికలో 'విద్యార్థులతో నీరు మోపిస్తున్న టీచర్లు' కథనానికి ఆయన స్పందించి విచారణకు ఆదేశించారు. విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. విచారణ అనంతరం టీచర్లపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

గుంత పూడ్చివేత



సిబ్బంది పూడ్చిన గుంత

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం తవ్విన గుంతను పూడ్చకపోవడంతో సాక్షి దినపత్రికలో 'తవ్వారు .. వదిలేశారు' కథనం ప్రచురితమైంది. దానికి సంబంధిత సిబ్బంది స్పందించారు. తూప్రాన్-నర్సాపూర్ హైవే పక్కన ప్రమాదభరితంగా ఉన్న గుంతను పూడ్చివేశారు. అందుకుగాను వ్యాపారులు, స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



కాలి బూడిదైన ఎలక్ట్రిక్ స్కూటీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల పంచాయతీ దుంపలకుంట చౌరస్తాలో ఓ ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైంది. మండలంలోని బుజరంపేట పల్లె గడ్డ తండాకు చెందిన లంబాడి రామ్ చరణ్ దుంపలకుంట చౌరస్తాలో ఓ దుకాణం వద్ద తన స్కూటీ నిలిపి బంధువుల ఇంటికి బస్సులో వెళ్లాడు. సాయంత్రం స్కూటీ నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి బ్యాటరీని వేరుచేయడానికి ప్రయత్నించారు. అప్పటికే స్కూటీ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా కాలి బూడిదైంది.

చెరువులో నీళ్లు ఉన్నా వదలడంలేదు



ఎండిపోతున్న వరి పొలం వద్ద రైతులు

- చెన్నాయిపల్లి రైతుల ఆందోళన
- ఎండుతున్న పంటలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేట గ్రామ శివారులోని నల్లచెరువులో నీటి నిలువలు ఉన్నప్పటికీ పంటల సాగుకు అవసరమైన నీరు వదలడంలేదని చెన్నాయిపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శాలిపేట గ్రామ నల్లచెరువు నుంచి శాలిపేట, చెన్నాయిపల్లి గ్రామాల రైతులకు చెందిన భూములకు నీరు వదలాల్సి ఉంది. పంట చేతికందే సమయంలో నీరు వదలకుండా శాలిపేట గ్రామ పెద్దలు ఇబ్బందులు పెడుతున్నారని చెన్నాయిపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులకు విన్నవించినప్పటికీ చర్యలు చెపట్టడం లేదని ఆరోపించారు. చేతికొచ్చిన పంట ఎండు ముఖం పడుతున్నా అధికారులు స్పందించడంలేదని వాపోయారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు స్పందించి సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

3 నెలలుగా అందని జీతాలు

వేతనాల కోసం కార్మికుల ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు వసంత, పోచమ్మ, స్వరూప, సైదమ్మ, అగమయ్య, వెంకటేశ్, భాస్కర్, అశోక్, నర్సింహులు తదితరులు శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం మాట్లాడుతూ.. శివ్వంపేట మేజర్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న తమకు జనవరి నుంచి వేతనాలు అందడంలేదని వాపోయారు. రెక్కడితే గాని డొక్కాడని తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సక్రమంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవిని వివరణ కోరగా జనవరి నుంచి సీఎఫ్‌సీ, ఎస్ఎఫ్‌సీ నిధులు రావడంలేదని పంచాయతీకి ఇతర ఆదాయ వనరులు లేకపోవడంతో కార్మికుల వేతనాల చెల్లింపులో ఆలస్యం అవుతుందని చెప్పారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటుచేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం వెల్దుర్తిలో కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్‌చారి శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు సామూహిక నమాజ్ అనంతరం ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు మల్లేశం, సుధాకర్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు నిలయాలు శిశుమందిరాలు

తహసీల్దార్ రజనీకుమారి



మాట్లాడుతున్న ప్రధానాచార్యుడు లక్ష్మీనారాయణ

రామాయంపేట(మెదక్): శిశుమందిరాలు క్రమశిక్షణకు నిలయాలని స్థానిక తహసీల్దార్ రజనీకుమారి అన్నారు. స్థానిక రెడ్డికాలనీలో ఉన్న అశోక్ సింఘాల్ శిశుమందిర్ పాఠశాల ప్రథమ వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల క్రమశిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు చాలా బాగున్నాయన్నారు. సరస్వతి విద్యాపీఠం సంగారెడ్డి విభాగ్ ప్రముఖ్ వెంకట్‌రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని దేశభక్తిగల పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయమన్నారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల కమిటీ అధ్యక్షుడు సంగమేశ్వర్, కార్యదర్శి పండరినాథ్, సభ్యులు శ్రీధర్‌రావు, ముత్యాలు, మల్లారెడ్డి, రాజు, బీనా, ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చేపల వేటలో ఫ్లెమింగో పక్షులు

ఫ్లెమింగో పక్షుల సందడి

కొల్చారం(నర్సాపూర్): ముదురుతున్న ఎండలతో చెరువుల్లో, కుంటల్లో ఇప్పటికే నీరు అడుగంటుతోంది. ఆహారాన్ని వెతుక్కుంటూ చెరువులు, కుంటల వద్ద విదేశీ పక్షులైన ఫ్లెమింగోలు సందడి చేస్తున్నాయి. ఎనగండ్ల పరిధిలోని మామిడి చెరువులోని నీటి మడుగుల్లో శుక్రవారం ఫ్లెమింగో పక్షులు చేపల కోసం వెతుకుతున్న దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

సంక్షిప్త వార్తలు

◆ నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

నారాయణఖేడ్: బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని స్థానిక కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ శాసనసభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ పార్లమెంటు అభ్యర్థి గాలిఅనిల్ కుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

◆ బీజేపీ మండల స్థాయి సమావేశం

శివ్వంపేట(నర్సాపూర్): బీజేపీ మండల స్థాయి సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం చండీలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు.

◆ సీసీ రోడ్డును క్యూరింగ్ చేయండి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో దెబ్బతింటోంది. ఇటీవల గ్రామంలో రూ.5లక్షల పంచాయితీ రాజ్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసిన మొదటి రోజు మాత్రమే నీళ్లుపోశారని, మళ్లీ పోయకపోవడంతో ఎండలకు సీసీ రోడ్డు దెబ్బతింటోందని కాలనీ వాసులు తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్‌శాఖ మండల ఏఈ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా సీసీ రోడ్డుపై నీరు నిలిచేందుకు ఏర్పాటు చేసిన మడులపై నుంచి వాహనాలు వెళ్లడంతో కట్టలు తెగిపోయాయన్నారు. క్యూరింగ్‌కు చర్యలు చేపడతామన్నారు.

◆ నచ్చిన రంగాల్లో రాణించాలి

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులు తమకు నచ్చిన రంగాల్లో రాణించేందుకు పాఠశాల స్థాయి నుంచే కృషి చేయాలని ఎస్ఐ షేక్ యూనూస్ అహ్మద్ అలీ అన్నారు. మండలంలోని లద్నూరు గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవీందర్ అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృతాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ గజ్జుక సమ్మయ్య, మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎస్ఎంసీ చైర్మన్ శారద, హరిప్రసాద్, ఉపేందర్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

◆ ఎస్ఎఫ్ఐ జిల్లా సభలు..

దుబ్బాకటౌన్: ఏప్రిల్ 3, 4వ తేదీల్లో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అరవింద్ పిలుపునిచ్చారు. శుక్రవారం దుబ్బాకలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎస్ఎఫ్ఐ భవిష్యత్ కార్యాచరణ కోసమే మహా సభలను నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను ప్రైవేటీకరణ చేసేపనిలో ఉందని విమర్శించారు. రానున్న కాలంలో విద్యార్థులు పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాధిక్, నాయకులు స్వామి, అరవింద్, ప్రశాంత్, నందిని, కావ్య, నవ్య, చందు తదితరులు పాల్గొన్నారు.

◆ చెరువుల సంరక్షణకు కృషి చేయాలి

గజ్వేల్‌రూరల్: చెరువులను సంరక్షించుకునేందుకు అందరూ కలసికట్టుగా కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో శుక్రవారం గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండో రోజు వలంటీర్లు చెరువు పరిసరాలు, ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల ద్వారా ఎంతో మేలు జరుగుతుందని, వ్యవసాయం చేసేందుకు ప్రధాన ఆధారమన్నారు. ప్రజలు చెత్తా చెదారాన్ని చెరువులో వేస్తే నీరు కలుషితమవుతుందని, చెరువును పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జేజేల వెంకటేశంగౌడ్, అధ్యాపకులు రాజు, సాయికృష్ణ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.